సాక్షి
నల్లగొండ
శుక్రవారం । 14 । మార్చి । 2025



రైతులకు నాబార్డు చేయూత
గిరిజన రైతులకు నాబార్డు అండగా నిలుస్తోంది. ఆ సంస్థ ఇస్తున్న నిధులతో రైతులు స్వావలంబన సాధిస్తున్నారు. - 8లో



ఇసుక బజార్లు ఏర్పాటు
ఇసుక బజార్ల ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీ సుశీల్‌కుమార్ అన్నారు. - 8లో

రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6-31 (శుక్రవారం సా॥)
సహర్ 5-02 (శనివారం ఉ॥)

న్యూస్‌రీల్

జిల్లా ప్రజలకు మంత్రి హోలి శుభాకాంక్షలు

నల్లగొండ: జిల్లా ప్రజలు హోలి పండుగను సహజ సిద్ధమైన రంగులతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. జిల్లా ప్రజలకు హోలి శుభాకాంక్షలు తెలియజేశారు.

నేడు ఆమనగల్‌కు మంత్రి రాక
మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం 6 గంటలకు జిల్లాలోని వేములపల్లి మండలం ఆమనగల్‌కు రానున్నారు. స్థానికంగా జరిగే శ్రీపార్వతి రామలింగేశ్వర స్వామి దేవస్థాన జాతరలో మంత్రి పాల్గొంటారు. ఈ సందర్భంగా ఆలయంలో పూజలు చేస్తారు. రాత్రి 7 గంటలకు ఆమనగల్ నుంచి బయలుదేరి హైదరాబాద్ వెళతారు.

హెచ్‌ఎండీఏ పరిధిలోకి 14 గ్రామాలు

మర్రిగూడ: మర్రిగూడ మండంలోని 14 రెవెన్యూ గ్రామాలు హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధిలోకి విస్తరిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రీజినల్ రింగ్ రోడ్డులో ఆయా గ్రామాలు అంతర్భాగంగా ఉన్నట్లు తెలుస్తోంది. విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం మండలంలోని దామెరభీమనపల్లి, బట్లపల్లి, ఇందుర్తి, ఖుదాబక్షపల్లి, కొండూరు, లెంకలపల్లి, మర్రిగూడ, మేటిచందాపురం, సరంపేట, తమ్మడపల్లి, వట్టిపల్లి, భట్లపల్లి, వెంకేపల్లి, యరగండ్లపల్లి గ్రామాలు ఉన్నాయి. కాగా తమకు అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు అందలేదని మండల అధికారులు అంటున్నారు.

19, 20 తేదీల్లో 'వికసిత్ భారత్'

రామగిరి(నల్లగొండ): నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో ఈనెల 19, 20 తేదీల్లో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం జరగనుందని మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మద్దిలేటి, ప్రిన్సిపాల్ ఎస్.ఉపేందర్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఎన్జీ కళాశాలలో కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ సిబ్బంది హరికిషన్, వీరస్వామి, శేఖర్, స్వప్న, వెంకట్‌రెడ్డి, శిరాణి, సావిత్రి, మల్లేశం, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దీప్తి

కనగల్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు చట్టాలపై అవగాహన పెంచుకోవడం చాలా అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీప్తి అన్నారు. గురువారం కనగల్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో జీసీఈసీ(గర్ల్ చైల్డ్ ఇంప్రూమెంట్ క్లబ్) ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలు, అక్షరాస్యతపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ థామసయ్య, జీసీఈసీ కన్వీనర్ రాధిక పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

నల్లగొండ: ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు ఫస్టియర్ మ్యాథ్స్–1బి, జువాలజీ–1, హిస్టరీ–1 పరీక్షలు జరిగాయి. వీటికి జిల్లావ్యాప్తంగా మొత్తం 13,772 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 13,171 మంది హాజరయ్యారు. 601 మంది గైర్హాజరయ్యారని డీఐఈఓ దస్రు నాయక్ తెలిపారు.

పశువైద్యశాల తనిఖీ


మందుల స్టాక్‌ను పరిశీలిస్తున్న జేడీ

వేములపల్లి(మాడ్గులపల్లి): మాడ్గులపల్లి మండల కేంద్రంలోని పశువైద్యశాలను గురువారం జిల్లా పశువైద్య, పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ జీవీ.రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందుల స్టాక్, రికార్డులను పరిశీలించారు. అయితే పశువైద్యశాలలో తహసీల్దార్ కార్యాలయం కూడా నిర్వహిస్తుండడంతో ఏర్పడుతున్న ఇబ్బందులు తెలపడంతో ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆయన వెంట మండల పశువైద్యాధికారి వినయ్‌కుమార్, సిబ్బంది తదితరులు ఉన్నారు.



ఎస్పీతో కలిసి క్రీడా జ్యోతిని వెలిగిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తూ..

పోలీసులు క్రీడాస్ఫూర్తిని చాటాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: పోలీసులు క్రీడా స్ఫూర్తిని చాటాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నల్లగొండలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో జిల్లా పోలీస్ యాన్యువల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్–2025 కార్యక్రమాన్ని గురువారం ఆమె.. ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. పోలీస్ వృత్తి అంటేనే ఒత్తిడితో కూడుకున్నదని, ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహించడం ద్వారా పోలీస్ శాఖలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బందికి మానసిక ఉల్లాసం లభిస్తుందన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ జిల్లా పోలీస్ శాఖలో పనిచేసే అధికారులకు, సిబ్బంది ఒత్తిడిని అధిగమించేందుకు ఈ క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. పోలీస్ సిబ్బంది ఆరోగ్యం కోసమే గేమ్స్‌తో పాటు పరేడ్, జిమ్ లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నమన్నారు. పోటీల్లో నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ డివిజన్లతోపాటు నల్లగొండ ఏఆర్ విభాగం జట్ల నుంచి సుమారు 300 మంది సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు. మూడు రోజుల పాటు జరగనున్న స్పోర్ట్స్ మీట్‌లో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్, షాట్‌పుట్ పోటీలు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మౌనిక, ఎస్బీ డీఎస్పీ రమేష్, డీటీసీ డీఎస్పీ విఠల్‌రెడ్డి, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

మండలిలో మనది అగ్రస్థానం

- శాసన మండలిలో ఉమ్మడి జిల్లాకు పెరిగిన ప్రాతినిధ్యం
- ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్సీలు.. తాజాగా మరో ముగ్గురు ఎన్నిక
- పుట్టిన స్థలం పరంగా.. బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌ది కూడా ఇక్కడే
- ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారికంగా ప్రకటన



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: శాసన మండలిలో ఎమ్మెల్సీల సంఖ్యాపరంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాకు అగ్రస్థానం దక్కింది. ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్సీలు ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఎమ్మెల్యే కోటాలో కాంగ్రెస్ నుంచి ఇద్దరు, సీపీఐ నుంచి ఒకరు ఎమ్మెల్సీలుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరంతా ప్రత్యక్షంగా జిల్లా రాజకీయాల్లో ఉన్నవారే. ఇక బీఆర్‌ఎస్ నుంచి ఎన్నికైన దాసోజు శ్రవణ్‌కు రాజకీయంగా నల్లగొండ జిల్లాతో పెద్దగా సంబంధం లేకపోయినా, పుట్టి పెరిగిందీ నల్లగొండ జిల్లా కేంద్రమే. దీంతో శాసన మండలిలో జిల్లాకు చెందిన ఎమ్మెల్సీల సంఖ్య ఏడుకు చేరుకుంది. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్సీలు గురువారం ధ్రువీకరణ పత్రాలు అందుకున్నారు.

ఇదే మొదటిసారి..
ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి 12 మంది ఎమ్మెల్యేలు ఉండగా.. శ్రవణ్ కాకుండా ఆరుగురు ఎమ్మెల్సీలు శాసన మండలిలో జిల్లా నుంచే ప్రాతినిధ్యం వహించబోతున్నారు. ప్రస్తుతం శాసనమండలి చైర్మన్‌గా గుత్తా సుఖేందర్‌రెడ్డి ఉండగా, పట్టభద్రుల ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న, స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా మంకెన కోటిరెడ్డి ఉన్నారు. ఇప్పుడు కేతావత్ శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, నెల్లికంటి సత్యం, దాసోజు శ్రవణ్‌కుమార్ ఈ నెల 30న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో శాసనమండలి పునరుద్ధరణ తర్వాత ఈ స్థాయిలో ప్రాతినిధ్యం దక్కడం ఇదే మొదటిసారి. ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న వారిలో గుత్తా సుఖేందర్‌రెడ్డి పదవీకాలం 2027 నవంబరు 21వ తేదీతో ముగియనుండగా, తీన్మార్ మల్లన్న పదవీకాలం అదే సంవత్సరం మార్చి 29వ తేదీతో ముగియనుంది. మంకెన కోటిరెడ్డి పదవీ కాలం 2028 జనవరి 4వ తేదీతో ముగియనుండగా, కేతావత్ శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, నెల్లికంటి సత్యం, దాసోజు శ్రవణ్‌కుమార్ పదవీ కాలం 2029 మార్చి 29వ తేదీన ముగియనుంది.

ప్రతిరోజూ గ్లాకోమా పరీక్షలు నిర్వహిస్తాం: డీఎంహెచ్‌ఓ


జీజీహెచ్‌లో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

నల్లగొండ టౌన్: జిల్లా కేంద్ర ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)లోని కంటి విభాగంలో ప్రతిరోజూ గ్లాకోమా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ గ్లాకోమా వారోత్సవాల సందర్భంగా గురువారం నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ కంట్రోల్ ఆఫ్ బ్లయిండ్ నెస్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య విద్యార్థులతో చేపట్టిన ర్యాలీని సూపరింటెండెంట్ డాక్టర్ అరుణకుమారితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15 వరకు నిర్వహించనున్న వారోత్సవాలు కొనసాగుతాయన్నారు. గ్లాకోమా పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ర్యాలీలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ మాతృనాయక్, కంటి విభాగం డాక్టర్లు సువర్ణ, మహేంద్ర, సాంబశివరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, డాక్టర్ నగేష్, డాక్టర్ కళ్యాణచక్రవర్తి, ఆర్తమాలజిస్టులు, మెడికల్ స్టాఫ్ జితేంద్ర, ప్రకాష్, కవిత, సరిత, నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



ఈయన రామచంద్రాచారి, నకిరేకల్ మండలం నర్సీపురం. తనకున్న 3.8 ఎకరాల భూమిని పిల్లల పేరున పట్టా చేశారు. ఇప్పుడు తాను తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆస్పత్రికి వెళ్తే రూ. 1.50 లక్షలు ఖర్చయింది. పిల్లలు పట్టించుకోవడం లేదు. తనను ఆదుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు. దీంతో వారి పిల్లలను పిలిపించి సమస్యను పరిష్కరించాలని, ఒప్పుకోకపోతే ఆయన భూమి ఆయనకు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి ఆర్డీవోకు ఆదేశాలు జారీచేశారు.



ఈయన కె.యాదగిరి, దేవరకొండకు చెందిన ఎక్స్ సర్వీస్‌మెన్. ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద 1985లో దేవరకొండలో ఆయనకు ప్రభుత్వం ఐదు ఎకరాల భూమి ఇచ్చింది. కార్గిల్ యుద్ధ సమయంలో సైనిక అధికారుల పిలుపుమేరకు మళ్లీ వెళ్లారు. యుద్ధం ముగిశాక వచ్చి, హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. దేవరకొండలో తనకు ఇచ్చిన భూమిని ఇటీవల కొందరు ఆక్రమించారని, తన భూమి తనకు ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించారు. వెంటనే దీనిపై చర్యలు చేపట్టాలని దేవరకొండ ఆర్డీవోను కలెక్టర్ ఆదేశించారు.

నేనున్నానని..

కుటుంబ సభ్యుల ఆదరణకు నోచుకోని వృద్ధులు, దివ్యాంగులకు అండగా

- వారి కోసం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి
- రాష్ట్రంలోనే మొదటగా నల్లగొండలో శ్రీకారం
- గ్రీవెన్స్‌కు బారులు తీరిన వృద్ధులు, వికలాంగులు
- సమస్యలు తెలుసుకుని.. పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు
- ఇకపై ప్రతి గురువారం 'ప్రత్యేక గ్రీవెన్స్'


ప్రజావాణిలో బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి


ప్రజావాణికి వస్తున్న దివ్యాంగుడు

నల్లగొండ: వృద్ధులు, దివ్యాంగుల కోసం నల్లగొండ కలెక్టరేట్‌లో తొలిసారిగా ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించారు. ఇందుకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం శ్రీకారం చుట్టారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి వివిధ సమస్యలపై బాధితులు పెద్ద ఎత్తున కలెక్టరేట్‌కు వస్తున్నారు. ఈ నేపథ్యంలో వృద్ధులు, దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన కలెక్టర్ ప్రతి గురువారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించాలని నిర్ణయించారు. తొలిసారిగా నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌కు 49 మంది బాధితులు తమ సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదులు అందజేశారు. కొందరు వృద్ధులు పెన్షన్ ఇప్పించాలని రాగా, మరికొందరు మా పిల్లలు ఆస్తులు పంచుకుని తమను పట్టించుకోవడం లేదని.. మాకు ఆధారం చూపాలంటూ విన్నవించారు. వృద్ధులు, దివ్యాంగుల సమస్యలను కలెక్టర్ సావదానంగా విని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. మొదటిసారిగా వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక ప్రజావాణి నిర్వహించినందుకు వయో వృద్ధులు, దివ్యాంగుల సంఘాల నాయకులు కలెక్టర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, ఇన్‌చార్జి డీఆర్‌ఓ అశోక్‌రెడ్డి, మహిళా సంక్షేమ సంఘం అధికారి కృష్ణవేణి, వైద్య ఆరోగ్య శాఖ అధికారి పుట్ల శ్రీనివాస్, డీఆర్‌డీఓ అధికారులు పాల్గొన్నారు.

వికలాంగుల పింఛన్ ఇప్పించాలి



పక్షవాతం వచ్చి ఆరు సంవత్సరాలైంది. ఎలాంటి పనిచేయలేకపోతున్నాం. పిల్లలు కూడా కూలి పనిచేస్తున్నారు. మాకు పెన్షన్ ఇప్పిస్తే పిల్లలకు భారం తగ్గుతుంది. మాకు కూడా ఇబ్బందులు తప్పుతాయి. పెన్షన్ ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించాం.
– మిట్టగడ్డల సంజీవ–జయమ్మ, దేవరకొండ

భూమి తీసుకుండ్రు.. పట్టించుకోవడం లేదు



నాకున్న మూడెకరాల భూమిని ఇద్దరు కొడుకులు పట్టా చేయించుకున్నారు. 18 ఏళ్ల క్రితం నా భార్య చనిపోయింది. కూతురు వద్ద నకిరేకల్‌లో ఉంటున్నాను. నాకు పక్షవాతం వచ్చి ఆసుపత్రిలో పడితే రూ.2 లక్షల ఖర్చయింది. కొడుకులు నా భూమిని అమ్ముకోవాలని చూస్తున్నారు. నా భూమిని తిరిగి నాకు పట్టా చేయండి. లేదా నాకు దారి చూపాలి.
– నర్సింగ్ సాయిలు, మంగళపల్లి, నకిరేకల్ మండలం

మాకు ఆధారం లేదు.. ఆదుకోండి



నా భార్య అంజమ్మకు నాలుగేళ్ల క్రితం యాక్సిడెంట్‌లో కాలు విరిగింది. ప్రస్తుతం మేము షుగర్, బీపీతో ఇబ్బందులు పడుతున్నాం. పిల్లలు బతుకు దెరువుకు హైదరాబాద్ పోయారు. అప్పుడో..ఇప్పుడో కొన్ని పైసలు పంపుతున్నా అవి మందులకు సరిపోవడం లేదని కలెక్టర్‌కు విన్నవించుకున్నాం. కలెక్టరమ్మ స్పందించి దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా షుగర్, బీపీ మందులు ఇప్పించాలని అధికారులకు ఆదేశించారు.
– కేశవులు–అంజమ్మ, దేవరకొండ

బతకడానికి ఆధారం చూపాలి



నాకు చిన్న తనంలోనే పోలియో వచ్చి రెండు కాళ్లు పనిచేయడం లేదు. నాన్న లేడు. అమ్మ కూడా అనారోగ్యంతో ఉంది. అన్నల పెళ్లిళ్లు అయ్యాయి. నన్ను పట్టించుకునే పరిస్థితి వారికి లేదు. నాకు ఏదేని ఉద్యోగంతోపాటు బ్యాటరీ వాహనాన్ని ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించుకున్నా. దీంతో స్పందించిన కలెక్టర్ ఎలక్ట్రిక్ వాహనం ఇచ్చి ఏదైనా ఉద్యోగం కల్పించాలని వికలాంగుల శాఖతోపాటు నల్లగొండ ఆర్డీఓను ఆదేశించారు.
– సామ నాగలక్ష్మి, చింతపల్లి, మిర్యాలగూడ మండలం

తాగు నీటి సమస్య తలెత్తకుండా చూడాలి

- జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య

కేతేపల్లి: ప్రస్తుత వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య అన్నారు. గురువారం కేతేపల్లిలోని ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రిపేరులో ఉన్న బోర్లకు వెంటనే మరమ్మతులు చేయాలని, గ్రామాల్లో వంద శాతం పన్నులను వసూలు చేయాలని ఆదేశించారు. అనంతరం మండలంలోని చీకటిగూడెం గ్రామ పంచాయితీ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంపీఓ నాగలక్ష్మి, మిషన్ భగీరథ ఏఈఈ సాయికుమార్, ఏపీఓ ఉన్నారు.


మాట్లాడుతున్న డీపీఓ వెంకయ్య

జగదీష్‌రెడ్డి సస్పెన్షన్‌ను ఎత్తివేయాలి


నిరసన తెలుపుతున్న కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు

నల్లగొండ టూటౌన్: శాసనసభలో రైతాంగ సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించిన మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. అసెంబ్లీ నుంచి గుంటకండ్ల జగదీష్‌రెడ్డిని సస్పెండ్ చేయడాన్ని ఖండిస్తూ కంచర్ల భూపాల్‌రెడ్డి నేతృత్వంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు గురువారం నల్లగొండలోని పెద్ద గడియారం సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలపై ప్రశ్నించే గొంతులు ఉండవద్దనే ఉద్దేశంతోనే జగదీష్‌రెడ్డిని సభను సస్పెన్షన్ చేశారని ఆరోపించారు. ప్రజల సమస్యలపై ప్రశ్నిస్తే ప్రభుత్వ పెద్దలు, మంత్రులు తట్టుకోలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ నాయకులకు తగిన బుద్ధి జెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయబోతుండగా పోలీసులు అడ్డుకోవడంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసుల చేతిలో నుంచి దిష్టిబొమ్మ లాక్కుని పార్టీ నాయకులు దహనం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, పార్టీ నాయకులు కటికం సత్తయ్యగౌడ్, రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి, అభిమన్యు శ్రీనివాస్, బోనగిరి దేవేందర్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, కొండూరు సత్యనారాయణ, మారగోని గణేష్, కరీంపాషా, గోవర్ధన్, బొమ్మరబోయిన నాగార్జున, యుగేంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగు యాంత్రీకరణ.. పునరుద్ధరణ

- రూ. 1.81 కోట్ల నిధులు కేటాయించిన ప్రభుత్వం
- నెలాఖరు వరకు యూనిట్ల గ్రౌండింగ్‌కు ఆదేశం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతాంగం



నల్లగొండ అగ్రికల్చర్: గత ప్రభుత్వ హయాంలో 2018 సంవత్సరంలో నిలిచిపోయిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం పునరుద్ధరణకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రైతులకు సబ్సిడీపై వివిధ యంత్ర పరికరాలు ఇచ్చేందుకు జిల్లాకు 2024 సంవత్సరానికి గాను రూ.1,81,36,000 నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. ఇప్పటికే పథకం అమలు కోసం విధివిధానాలు రూపొందించిన రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ జిల్లాలకు పంపించారు. ఏడేళ్లుగా వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు సబ్సిడీపై ఇవ్వకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. అయితే ప్రభుత్వం తిరిగి సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు అందించడానికి యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరిస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 820 యూనిట్లు అందించడానికి ప్రభుత్వం నిధులను విడుదల చేయడంతో పనిముట్ల పంపిణీకి జిల్లా వ్యవసాయ శాఖ అవసరమైన చర్యలను ముమ్మరం చేసింది.

నెలాఖరు వరకు గ్రౌండింగ్
యాంత్రీకరణ పథకాన్ని పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. దీంట్లోభాగంగా పాటుగా ఈనెలాఖరు వరకు కచ్చితంగా యూనిట్లను రైతులకు గ్రౌండింగ్ చేయాలని ఆదేశించింది. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు రెండు మూడు రోజుల్లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి మండలాల వారీగా యూనిట్ల పంపిణీతో పాటు అర్హుల జాబితాను నివేదించేందుకు కసరత్తు ప్రారంభించారు. అనంతరం ఈనెల 31లోపు లబ్ధిదారులకు యూనిట్లు గ్రౌండింగ్ చేయనున్నారు

మండలాల వారీగా పరికరాలు కేటాయిస్తాం



నెలాఖరు వరకు లబ్ధిదారులను ఎంపిక చేసి వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు గ్రౌండింగ్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కలెక్టర్ అనుమతితో మండలాల వారీగా పరికరాల సంఖ్యను కేటాయించి యూనిట్లను గ్రౌండింగ్ చేస్తాం.
పాల్వాయి శ్రవణ్‌కుమార్, డీఏఓ, నల్లగొండ

మంజూరైన యూనిట్లు	సంఖ్య	నిధులు (రూ.లక్షల్లో..)
చేతిపంపులు	228	2.28
పవర్ స్ప్రేయర్లు	234	21.06
డ్రోన్‌లు	1	5.00
రోటోవేటర్లు	135	64.80
విత్తనాలు వేసే పరికరాలు	30	9.00
ట్రాక్టర్‌తో వాడే డ్రమ్ ఇంప్లిమెంట్	141	28.58
పవర్‌టిల్లర్లు	7	7.00
ఎద్దులతో బోదలు పోసే పరికరాలు	8	1.04
ట్రాక్టర్లతో బోదలుపోసే పరికరాలు	10	12.00
పవర్‌వీడర్స్	6	2.10
బ్రష్‌కట్టర్స్	10	3.50
ట్రాక్టర్లు	4	20.00
గడ్డిచుట్టే పరికరాలు	5	5.00

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొట్టిన ట్రాక్టర్.. వ్యక్తి మృతి


దుర్గాచారి (ఫైల్)

కోదాడరూరల్: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొనడంతో మృతిచెందాడు. ఈ ఘటన కోదాడ మండలం గుడిబండ శివారులో గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అనంతగిరి మండలం శాంతినగర్‌కు చెందిన తల్లోజు దుర్గాచారి(29) కోదాడ పట్టణంలోని హిందూజా కంపెనీలో పనిచేస్తున్నాడు. పనిలో భాగంగా గురువారం బైక్‌పై కోదాడ నుంచి మేళ్లచెర్వు వెళ్తుండగా కోదాడ మండలం గుడిబండ గ్రామ శివారులో కాపుగల్లు క్రాస్‌రోడ్‌లో ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. దుర్గాచారికి తీవ్రగాయాలు కాగా స్థానికులు 108 వాహనంలో కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు అవివాహితుడు. మృతుడి తండ్రి పుల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జూదరుల అరెస్ట్

అనంతగిరి: మండల పరిధిలోని ఖానాపురం శివారులో పేకాట ఆడుతున్న వారిని అనంతగిరి పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపురం గ్రామ శివారులో కొందరు పేకాట ఆడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడులు నిర్వహించారు. ఖానాపురం గ్రామానికి చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారి నుంచి రూ.1430 నగదు. రెండు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

350 జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలో అక్రమంగా బ్లాసింగ్‌కు పాల్పడుతున్న ఓ వ్యక్తిని ఎస్‌ఓటీ పోలీసులు గురువారం అదుపులోకి తీసుకుని 350 జిలెటిన్ స్టిక్స్ స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ చేస్తున్నారనే సమాచారంతో బ్లాస్టింగ్ చేసే ప్రదేశంలో అతడిని అదుపులోకి తీసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు ఎస్‌ఓటీ పోలీసులు వెలడించారు. అక్రమ బ్లాస్టింగ్‌కు పాల్పడుతున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ రమేష్ తెలిపారు.

గిరిజన రైతులకు నాబార్డు చేయూత

- దేవరకొండ మండలంలో ఎంపిక చేసిన గ్రామాల్లో డబ్ల్యూడీఎఫ్ నిధులతో భూ అభివృద్ధి పనులు
- ఏఆర్‌డీఎస్ ఆధ్వర్యంలో రైతులకు స్ప్రింక్లర్లు, పైప్‌లు, డ్రిప్‌లు అందజేత
- ఉపాధికి బాటలు వేస్తున్న వాటర్‌షెడ్ కమిటీలు


వెంకట్‌తండాలో నాబార్డు సహకారంతో దొండ పందిరి ఏర్పాటు చేసిన రైతు

దేవరకొండ: నాబార్డు(నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్) గిరిజన రైతులకు అండగా నిలుస్తోంది. నాబార్డు మంజూరు చేస్తున్న నిధులతో గిరిజన రైతులు జలసంరక్షణ పనులతో పాటు వివిధ రకాల పంటలు సాగు చేస్తూ ఆర్థికంగా బలోపేతమవుతున్నారు. దేవరకొండ మండల పరిధిలోని ధర్మతండా, సపావట్ తండా, గొల్లపల్లి, వెంకట్‌తండాను ఐదేళ్ల క్రితం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన నాబార్డు డబ్ల్యూడీఎఫ్ (వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ ఫండ్) ఆయా గ్రామాల్లో భూ అభివృద్ధి పనులు చేపట్టింది. తద్వారా ఇక్కడ ఏర్పాటైన వాటర్‌షెడ్ కమిటీలు రైతుల కోసం వివిధ పనులకు సబ్సిడీలు మంజూరు చేస్తూనే తండాల వాసుల ఉపాధి కల్పనకు కూడా బాటలు వేశాయి.

నాలుగు గ్రామాల్లో చేపట్టిన పనులు..

- నాబార్డు ఎంపిక చేసిన ధర్మతండా, సపావట్‌తండా, గొల్లపల్లి, వెంకట్‌తండాల్లో అర్హులైన రైతుల పొలాల్లో మొదటగా లోతట్టు ప్రాంతాల్లో నీరు వృథాగా పోకుండా రాతి కట్టడం, ఫాంపాండ్స్, సంకెన్ పిట్స్, వరద కట్టల నిర్మాణాలు చేపట్టారు.
- నీటి నిల్వలు తగ్గకుండా చూడడం, బోరు రీచార్జ్ కావడం వంటి జలసంరక్షణ పనులు చేశారు.
- ఈ నాలుగు తండాల్లోని 1,100 హెక్టార్ల భూములకు సంబంధించి అర్హులైన రైతులను ఎంపిక చేసి నాబార్డు సహకారంతో యాక్షన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ(ఏఆర్‌డీఎస్) ఆధ్వర్యంలో స్ప్రింక్లర్లు, పైపులు, డ్రిప్‌లు అందించారు.
- దొండ సాగుకు పందిళ్ల ఏర్పాటు, రైతుల పొలాలకు పైప్‌లైన్ వంటి పనులు చేపట్టి ప్రోత్సహించారు.
- నిధుల విషయంలో రైతుల వాటా 30శాతం ఉండగా నాబార్డు 70శాతం నిధులు మంజూరు చేసింది.
- మొత్తంగా ఐదేళ్లలో గిరిజన రైతుల పొలాల్లో అభివృద్ధి పనులకు నాబార్డు రూ.80లక్షలు మంజూరు చేసింది. దీంతో గిరిజనులు వివిధ పంటలతో పాటు కూరగాయల సాగు చేస్తూ కొంత మేర ఆర్థిక స్వావలంబన సాధించారు.

డ్రిప్ ద్వారా కూరగాయల సాగు



నాకున్న ఎకరం భూమిలో వ్యవసాయం చేస్తున్నాను. ఈసారి బోరులో నీరు తక్కువగా ఉండడంతో కేవలం 20గుంటల భూమిలో కూరగాయలు సాగు చేశాను. నాకు నాబార్డు ద్వారా ఎకరానికి సరిపడా డ్రిప్ ఇవ్వడం ద్వారా ప్రస్తుతం నాలుగు రకాల కూరగాయ పంటలు సాగు చేస్తున్నాను. నాబార్డు డ్రిప్ అందించడం ద్వారా కూరగాయల సాగు సులభతరమైంది.

– కృష్ణయ్య, రైతు, వెంకట్‌తండా

రైతులకు ఎంతో మేలు



నాబార్డు ద్వారా చేపట్టిన పనులు రైతులకు ఎంతో మేలు చేకూర్చాయి. గతంలో చేపట్టిన జలసంరక్షణ పనులతో ఇక్కడి రైతులు లబ్ధి పొందారు. ఇప్పటికే మొదటి విడుతలో చేపట్టిన పనులు సత్ఫలితాలిచ్చాయి. వాటర్‌షెడ్ కమిటీల ద్వారా ఎంపిక చేయబడిన రైతుల పొలాల్లో అభివృద్ధి పనులు చేపట్టాం. తద్వారా రైతులు తమ భూములు సాగుకు యోగ్యంగా మార్చుకుంటున్నారు.

– ఖాజా ఖైరత్‌అలీ, ఏఆర్‌డీఎస్ చైర్మన్

హోలి.. కావాలి ఆనందాల కేళి

- కళ్లలో, చర్మంపై రంగులు పడకుండా జాగ్రత్తలు వహించాలి
- రసాయనిక రంగులతో ఆరోగ్యానికి ముప్పంటున్న వైద్య నిపుణులు
- సహజమైన రంగులు వాడితే మేలు అని సూచన



రామగిరి(నల్లగొండ): హోలి పండుగ అనగానే అందరిలో ఉత్సాహం వస్తుంది. చిన్న నుంచి పెద్దల వరకు హుషారుగా రంగులు చల్లుకుంటారు. హోలి పండుగ రోజు కొన్ని జాగ్రత్తలు పాటిస్తే విషాదాలకు తావులేకుండా ఆనందాలు నిండుతాయి. రసాయన రంగులతో చర్మ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. ప్రకృతిలో లభించే పదార్థాలతో తయారుచేసిన రంగులను వినియోగించితే మంచి జరుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రసాయనిక రంగుల్లో అల్యూమినియం బ్రోమైడ్, లెడ్ ఆక్సైడ్, మెర్క్యూరీ సల్ఫైడ్, కాపర్ సల్ఫైడ్ వంటివి ఉంటాయని, వీటి వల్ల శరీరానికి హాని కలుగుతుంది. ఒకవేళ కంట్లో పడితే చూపు కూడా కోల్పోయే ప్రమాదం ఉంది.

సహజ రంగులతో మేలు..

ప్రకృతిలో లభించే పువ్వులు, ఆకులతో రంగులను తయారు చేసుకుంటే శరీరానికి ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా మోదుగు పువ్వు, గోగు పువ్వులను నీటిలో మరిగించడంతో రంగు ద్రావణంగా మారుతుంది. ఇలాంటివి చల్లుకుంటే ఆరోగ్యానికి మేలు జరుగుతుంది.

మాయిశ్చరైజర్ రుద్దుకోవాలి



హోలి ఆడటానికి ముందు చర్మానికి మాయిశ్చరైజర్ వాడాలి. తద్వారా రసాయన రంగులు శరీరానికి అంటుకోవు. చర్మం మొత్తం కప్పిఉండేలా దుస్తులు ధరించాలి. పెదవులు, కళ్ల చుట్టూ పెట్రోలియం జెల్లి రాసుకోవాలి. ఆర్గానిక్ రంగులు వాడితే ఉత్తమం. హోలి పూర్తయిన తర్వాత గోరు వెచ్చని నీటితో స్నానం చేయాలి. చర్మంపై ఇరిటేషన్ అనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించండి.

– సీహెచ్. వెంకటకృష్ణ, చర్మవ్యాధి వైద్యుడు

జాగ్రత్తలు తప్పనిసరి



హోలి పండుగ రోజు రంగులు కంట్లో పడే ప్రమాదం ఉంటుంది. తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. కాంటాక్ట్ లెన్స్ వాడే వారు వాటిని తీసి హోలి ఆడాలి. కంట్లో రంగులు పడకుండా అద్దాలు వాడాలి. లూబ్రికేటింగ్ ఐ డ్రాప్స్ వాడాలి. ఒకవేళ కంట్లో రంగులు పడితే చల్లని నీటితో జాగ్రత్తగా శుభ్రం చేయాలి. కళ్లలో మంటగా అనిపిస్తే కంటి డాక్టర్‌ను సంప్రదించాలి.

– డాక్టర్ తాటిపల్లి ప్రసూషరితేష్, కంటి వైద్యురాలు

ఖేలో ఇండియా పోటీలకు అవకాశం కల్పించాలి


స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్‌కు మొక్క అందజేస్తున్న ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ హరీష్‌కుమార్ తదితరులు

నల్లగొండ టూటౌన్: మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఖేలో ఇండియా, జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణకు అవకాశం కల్పించాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలదేవికి ఎంజీయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ హరీష్‌కుమార్ నేతృత్వంలో వినతి పత్రం అందజేశారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో క్రీడా ప్రాంగణాలను జాతీయ స్థాయి ప్రమాణాలకు తగ్గట్టుగా అభివృద్ధి చేసినట్లు వివరించారు. క్రీడా ప్రాంగణాల ప్రత్యక్ష పరిశీలన కోసం ఎంజీ యూనివర్సిటీని సందర్శించాలని ఆమెకు విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట స్పోర్ట్స్ బోర్డ్ సభ్యులు ప్రొఫెసర్ సోమలింగం, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ రమావత్ మురళి తదితరులు ఉన్నారు.

46 కిలోల గంజాయి పట్టివేత

- పారిపోయిన నిందితుడు
- కారు స్వాధీనం

చౌటుప్పల్: కారులో తరలిస్తున్న 46 కిలోల గంజాయిని చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఎస్‌ఓటీ పోలీసులు బుధవారం రాత్రి పట్టుకున్నారు. చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం ఏజెన్సీ నుంచి కర్ణాటక రాష్ట్ర రాజధాని బెంగళూరుకు కారులో గంజాయి తరలిస్తున్నట్లు రాచకొండ ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందింది. ఈ క్రమంలో బుధవారం రాత్రి చౌటుప్పల్‌కు వచ్చిన ఎస్‌ఓటీ పోలీసులు విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై కాపుకాశారు. చౌటుప్పల్ పట్టణంలోని రిలయన్స్ ట్రెండ్స్ షోరూమ్ ఎదురుగా హైదరాబాద్ మార్గంలో అనుమానాస్పదంగా వెళ్తున్న కారును గుర్తించి పోలీసులు ఆపారు. కారు నడుపుతున్న వ్యక్తిని పోలీసులు ప్రశ్నిస్తుండగానే అతడు కారు అక్కడే వదిలేసి తప్పించుకొని పారిపోయాడు. కారులో తనిఖీ చేయగా 46 కిలోల గంజాయి లభించింది. పట్టుబడిన కారు, గంజాయిని స్థానిక పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. నిందితుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. నిందితుడు పట్టుబడిన తర్వాత ఈ కేసుకు సంబంధించిన పూర్తివివరాలు తెలుస్తాయని సీఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇసుక బజార్‌లు ఏర్పాటు

- రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీ సుశీల్‌కుమార్


వంగమర్తి వద్ద ఉన్న ప్రభుత్వ ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న టీజీఎండీసీ ఎండీ సుశీల్‌కుమార్

శాలిగౌరారం: ప్రజలకు నాణ్యమైన ఇసుకను సరసమైన ధరలకు అందించేందుకు మైనింగ్‌శాఖ ఆధ్వర్యంలో ఇసుక బజార్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎంబీసీ) వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సుశీల్‌కుమార్ అన్నారు. శాలిగౌరారం మండలం వంగమర్తి గ్రామ సమీపంలో మూసీ నది ఒడ్డున ఉన్న ప్రభుత్వ ఇసుక రీచ్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మూసీ నది నుంచి ఇసుక రవాణా, ఇసుక స్టాక్ పాయింట్, వేబ్రిడ్జిలను పరిశీలించారు. మూసీ ప్రాజెక్టులోని ఇసుకను నిర్ణీత సమయంలో వెలికితీసి స్టాక్ పాయింట్‌కు తరలించాలన్నారు. ప్రభుత్వ అభివృద్ధి పనులకు, ఇసుక బజార్‌లకు ఇసుక రవాణా చేసే వాహనాలు ఇసుక స్టాక్‌పాయింట్ వద్ద వేచిచూడకుండా త్వరితగతిన లోడింగ్ జరిగేలా యంత్రాలను ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత రీచ్ నిర్వాహకులకు సూచించారు. ఇసుక వాహనాలను తూకం వేసే వేబ్రిడ్జిని పరిశీలించారు. వేబ్రిడ్జిలో ఏర్పడిన రిపేర్లను తక్షణమే సరిచేసి ఇబ్బందులు తలెత్తకుండా చడాలని సిబ్బందికి సూచించారు. తూకం కోసం ఇసుక వాహనాలు వేచిచూడకుండా అదనంగా మరో వేబ్రిడ్జిని ఏర్పాటు చేయాలని సంబంధిత ఉన్నతాధికారులకు సూచించారు. ఇసుక వినియోగదారులకు తక్కువ ధరకు నాణ్యమైన ఇసుకను అందించేందుకు ప్రభుత్వం హైదరాబాద్‌లోని అబ్దుల్లాపూర్‌మెట్, బౌరంపేట్, వట్టినాగులపల్లిలో ఇసుక స్టాక్‌పాయింట్‌లను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తుందన్నారు. ఆయా ఇసుక బజార్‌లను ఈ నెల 15న ప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక బజార్‌లకు ఇసుకను తరలించి రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇసుకను విక్రయించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట మైనింగ్‌శాఖ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ జాకోబ్, అసిస్టెంట్ జియాలజిస్ట్ బాలు, సూపర్‌వైజర్ మహిపాల్ తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


సుజాత (ఫైల్)

మునుగోడు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మునుగోడు మండలం కచలాపురం గ్రామానికి చెందిన జంగ సుజాత(42) తల్లి చీకటిమామిడి గ్రామంలో ఉంటుంది. తన తల్లికి జ్వరం వస్తుండడంతో బుధవారం సుజాత తన కుమారుడితో కలిసి బైక్‌పై తల్లిని మునుగోడులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చూపించుకుని తిరిగి చీకటిమామిడికి వెళ్తున్నారు. మార్గమధ్యలో మునుగోడు మండల కేంద్రం పరిధిలోని పత్తి మిల్లు వద్ద గేదెకు ఢీకొట్టి ముగ్గురు కిందపడ్డారు. ఈ ప్రమాదంలో సుజాత తలకు తీవ్రంగా గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లింది. స్థానికులు 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

మిర్యాలగూడ అర్బన్: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మిర్యాలగూడ పట్టణంలోని శరణ్య గ్రీన్ హోమ్స్‌లో బుధవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. టూ టౌన్ సీఐ నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం .. వెస్ట్ బెంగాల్ రాష్ట్రానికి చెందిన బిశ్వజిత్ చక్రబోటి(44) గత కొద్ది రోజులుగా బెల్ కంపెనీ గెస్ట్ హౌజ్‌లో సర్వర్‌గా పని చేస్తున్నాడు. అప్పుల బాధతో మనస్తాపం చెంది గెస్ట్ హౌజ్‌లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడి అల్లుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పంట వ్యర్థాలను ఉపయోగించుకోవాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి


చెర్వుఅన్నారంలోని ఫ్యాక్టరీలో బయోచర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, తదితరులు

కట్టంగూర్: పంట వ్యర్థాలతో బయోచర్‌ను ఉత్పత్తి చేసి వినియోగించుకుంటే పంట దిగుబడి పెరగడంతో పాటు మట్టిలో నాణ్యత పెరుగుతుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గురువారం కట్టంగూర్ మండలం చెర్వుఅన్నారం గ్రామంలో తపోవనం బయోచర్ ఫ్యాక్టరీలో పంటల వ్యర్థాలతో తయారుచేస్తున్న బయోచర్(జీవ బొగ్గు)ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బయోచర్ గురించి వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఆక్సిజన్ లేకుడా పత్తి కట్టెను, వరి గడ్డితో పాటు ఇతర పంట వ్యర్థాలను వేడి చేసి కట్టెలో సేంద్రియ కర్బనం నిల్వ చేయడం ద్వారా బయోచర్ ఏర్పడుతుందని తెలిపారు. జిల్లాలోని పొలాల్లో ప్రస్తుతం 0.3 శాతం కంటే ఎక్కువ కర్బనం లేదన్నారు. బయోచర్ వాడకం వల్ల పొలంలో ఒక శాతం కర్బనం పెరిగి అధిక దిగుబడులు వస్తాయని, రైతులకు పెట్టుబడి ఖర్చు తగ్గుతుందని తెలిపారు. బయోచర్ సంస్థ వృథా వ్యర్థాలను సేకరించి ప్రాసెసింగ్ ద్వారా జీవ బొగ్గుగా మార్చి రైతులకు ఉచితంగా ఇవ్వడం అభినందనీయమన్నారు. విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై పండ్లు, పూల మొక్కలను తక్కువ ధరలో రైతులకు, ప్రజలకు సరఫరా చేసేందుకు, నర్సరీ పెంచేందుకు స్థలాన్ని కేటాయించాలని నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి కలెక్టర్‌ను కోరగా అవసరమైన స్థలాన్ని చూడాలని తహసీల్దార్ ప్రసాద్‌ను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రావణ్, జిల్లా పరిశ్రమల అధికారి కోటేశ్వర్‌రావు, నల్లగొండ ఆర్డీఓ యారాల అశోక్‌రెడ్డి, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, కట్టంగూర్ రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య లిమిటెడ్ స్థాపకులు, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, ఎఫ్‌పీఓ చైర్మన్ చెవుగోని సైదమ్మ ఉన్నారు.

సోలార్ విద్యుత్ ఉత్పత్తితో ఆదాయం పెంచుకోవచ్చు

సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా స్వయం సహాయక మహిళా సంఘాలు ఆదాయాన్ని సృష్టించుకోవచ్చని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛ శక్తి సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఆమె సందర్శించారు. ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రూ.50లక్షల చెక్కును అందజేయగా స్వయం సహాయక మహిళా సంఘాలు సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ శక్తి కేంద్రం ప్రతినిధి సుధాకర్, మహిళలు తదితరులు ఉన్నారు.

యువకుడు అదృశ్యం.. కేసు నమోదు


వినయ్

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం కిష్టాపురం గ్రామానికి చెందిన యువకుడు అదృశ్యమైన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. రూరల్ ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. కిష్టాపురం గ్రామానికి చెందిన బుర్రి వినయ్(23) ఈ నెల 9న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. స్వగ్రామమైన దామరచర్ల మండలం తెట్టెకుంటలో, బంధువుల ఇళ్లలో కూడా లేకపోవడంతో అతడి భార్య బుర్రి టీనారాణి మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. యువకుడి ఆచూకీ తెలిస్తే 87126 70189, 871267 15151 నంబర్లను సంప్రదించాలని పోలీసులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

మిర్యాలగూడ టౌన్: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడుచర్ల మండలం బక్కయ్యగూడేనికి చెందిన మారేపల్లి సైదులు(60) బుధవారం మిర్యాలగూడ మండలం శ్రీనివాస్‌నగర్ సమీపంలో గల ఫంక్షన్‌హాల్‌లో తన బంధువుల వివాహానికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో జడ్చర్ల–కోదాడ హైవేపై రోడ్డు దాటుతుండగా తుంగపాడు నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న బైక్ సైదులును ఢీకొట్టింది. అతడికి తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్స్ సాయంతో స్థానికులు మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమార్తె సట్టు నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు ఎక్కుతుండగా జారిపడిన ప్రయాణికుడు

- రక్షించిన రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది

భువనగిరి: రైలు ఎక్కే క్రమంలో జారిపడిన వ్యక్తిని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్) సిబ్బంది రక్షించారు. ఈ ఘటన బుధవారం రాత్రి భువనగిరి రైల్వే స్టేషన్‌లో జరిగింది. భువనగిరి ఆర్‌పీఎఫ్ ఎస్‌ఐ కిష్టయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బాజిరెడ్డి జగదీష్ అనే ప్రయాణికుడు నిజామాబాద్‌కు వెళ్లేందుకు బుధవారం రాత్రి భువనగిరి రైల్వే స్టేషన్‌లో టికెట్ తీసుకున్నాడు. రాత్రి 8.22 గంటలకు తిరుపతి నుంచి ఆదిలాబాద్‌కు వెళ్తున్న కృష్ణ ఎక్స్‌ప్రెస్ రైలు భువనగిరికి చేరుకుంది. రాత్రి 8.23 గంటలకు స్టేషన్ నుంచి రైలు కదలగా.. జగదీష్ రైలు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు రైలు, ప్లాట్‌ఫాం మధ్యలో జారిపడ్డాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ బాలాజీ గమనించి జగదీష్‌ను బయటకు లాగాడు. దీంతో ఎటువంటి గాయాలు కాలేదు.

భూసారం కాపాడుకుంటేనే అధిక దిగుబడి

- కేవీకే కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు
- కేవీకేలో ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతులకు కిసాన్ మేళా



మాట్లాడుతున్న కోఆర్డినేటర్ శ్రీనివాసరావు

త్రిపురారం: పంటల సాగులో రసాయన మందులు వాడుతుండడంతో భూసారం దెబ్బతింటుందని, భూసారాన్ని కాపాడుకుంటేనే అధిక దిగుబడులతో సాధించవచ్చని త్రిపురారం మండలంలోని కంపాసాగర్‌లో కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగాం కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం కేవీకేలో ఉమ్మడి జిల్లాలోని రైతులకు కిసాన్ మేళా కార్యక్రమం నిర్వహించారు. వరితో పాటు వివిధ రకాల పంటల సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు కేవీకే శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. భూమిలోని పోషకాలు మొక్కలకు సమపాలల్లో అందాలంటే సేంద్రియ ఎరువులను వినియోగించుకోవాలన్నారు. చీడపీడల నివారణకు అన్నిరకాల మందులను కలిపి పిచికారీ చేయడం వల్ల పంట నష్టపోవాల్సి వస్తుందన్నారు. వరి పొలంలో యూరియాతో పాటు పొటాష్ వేసుకోవడం వల్ల చీడపీడలను తట్టుకునే శక్తి పెరుగుతుందన్నారు. ప్రస్తుతం వరి పైరులో అగ్గితెగులు, కాండం కుళ్లు తెగులు, సుడిదోమను గమనించామని శాస్త్రవేత్తల సలహాలతో పురుగు మందులు సకాలంలో పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వరి పరిశోధనా స్థానం శాస్త్రవేత్త లింగయ్య, సేద్యపు విభాగం శాస్త్రవేత్త చంద్రోశేఖర్, సస్యరక్షణ శాస్త్రవేత్త రాములమ్మ, యంగ్ ప్రొఫెషనల్స్, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

